# ప్రజా మాటల

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

ప్రచురణ : జగిత్యాల సంపుటి : 05 సంచిక : 241 పేజీలు : 04 వెల రూ. 2 శనివారం 28 - 03 - 2026




లఢఖ్‌లో భారీగా మంచు తుపాను... ఆరుగురి మృతి

# భద్రాచలంలో ఘనంగా సీతారాముల కల్యాణోత్సవం

- పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం రేవంత్ రెడ్డి దంపతులు
- భద్రాచలంలో సీతారాముల కళ్యాణానికి సతీసమేతంగా హాజరైన సీఎం రేవంత్
- స్వామివారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పణ
- అంగరంగవైభవంగా జానకీరాముల కల్యాణం
- ఆలయ విస్తరణలో భాగంగా రూ.351 కోట్ల పనులకు శంకుస్థాపన
- కుటుంబసభ్యులతో కలిసి కల్యాణంలో పాల్గొన్న రేవంత్‌రెడ్డి, భట్టి భద్రాచలం ఆలయ అభివృద్ధి పనులకు భూమిపూజ చేసిన సీఎం
- మూడు దశల్లో రూ.586 కోట్లతో ఆలయ అభివృద్ధికి ప్రణాళికలు



**భద్రాచలం :** శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని భద్రాచలంలో జరిగిన సీతారాముల కళ్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ వేడుకకు సీఎం రేవంత్ రెడ్డి సతీసమేతంగా హాజరయ్యారు. సంప్రదాయం ప్రకారం స్వామివారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. - మిగతా 2 లో



ఆటల బరిలోకి తెలంగాణ

## ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు



- రాజకీయాలకు బ్రేక్.
- తెలంగాణ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఆటల పోటీల నిర్వహణ
- ఈ నెల 28, 29 తేదీల్లో హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో స్పోర్ట్స్ మీట్
- రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ప్రజాప్రతినిధులకు ఇలాంటి పోటీలు ఇదే ప్రథమం
- ప్రతినిధుల మధ్య స్నేహబంధం పెంచి, క్రీడా స్ఫూర్తి నింపడమే లక్ష్యం

**హైదరాబాద్ :** నిత్యం రాజకీయాలు, ప్రజా సమస్యలతో బిజీగా ఉండే తెలంగాణ ప్రజాప్రతినిధులు ఆటల బరిలోకి దిగనున్నారు. రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల కోసం 'లెజిస్లేటర్ స్పోర్ట్స్ మీట్2026' - మిగతా 2 లో



2 లో

## ఏప్రిల్ 25న కొత్త పార్టీ పేరు ప్రకటించనున్న కవిత

- కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించిన కవిత
- ఏప్రిల్ 25న పార్టీ ఆవిర్భావ సభకు ముహూర్తం ఖరారు
- ఈ సభ వేదికగా పార్టీ పేరు, జెండా ఆవిష్కరణ
- తెలంగాణ ఆడబిడ్డగా పార్టీ పెడుతున్నానని వెల్లడి
- యువత, మహిళలకు తమ పార్టీలో పెద్దపీట వేస్తామని హామీ

## చమురు కంపెనీలకు చెక్ పెట్టిన కేంద్రం

- ఇంధన ఎగుమతులపై పన్ను భారీగా పెంపు
- ఇంధనాన్ని విదేశాలకు తరలించకుండా కేంద్రం అడ్డుకట్ట
- లీటర్ డీజిల్‌పై రూ. 21.5కి ఎగుమతి పన్ను పెంపు
- దేశంలోని పెట్రోల్ బంకుల వద్ద కృత్రిమ రద్దీకి చెక్ పడే అవకాశం



**ఢిల్లీ :** పశ్చిమాసియా యుద్ధం కారణంగా గ్లోబల్ మార్కెట్‌లో ముడిచమురు ధరలు మండిపోతున్న తరుణంలో, కేంద్ర ప్రభుత్వం తన 'ఇండియా ఫస్ట్' పాలసీని మరోసారి చాటుకుంది. భారతీయ ఆయిల్ రిఫైనరీ కంపెనీలు అంతర్జాతీయంగా ఉన్న అధిక ధరల ఆశతో డీజిల్, విమాన ఇంధనాన్ని విదేశాలకు తరలించకుండా కేంద్రం అడ్డుకట్ట వేసింది. ఇందులో భాగంగా లీటర్ డీజిల్‌పై రూ. 21.5కి, విమాన ఇంధనం (ఏటీఎఫ్)పై రూ. 29.5కి ఎగుమతి పన్నును పెంచుతూ నిర్ణయం తీసుకుంది. దీనివల్ల రిఫైనరీ కంపెనీలకు విదేశాలకు ఎగుమతి చేయడం కంటే దేశీయ మార్కెట్‌కు - మిగతా 2 లో

## అయోధ్యలో వైభవంగా శ్రీరామ నవమి

- బాలరాముడికి 'సూర్యతిలకం'
- ఉత్తర్‌ప్రదేశ్‌లోని అయోధ్య రామ మందిరంలో అద్భుత దృశ్యం
- బాల రాముడి నుదుటిపై సూర్య కిరణాలు
- గత ఏడాది మాదిరిగానే, ఈసారి కూడా మధ్యాహ్నం 12 గంటలకు బాల రాముడి నుదుటిపై సూర్య కిరణాలు
- ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని మోదీ, ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్



**అయోధ్య :** శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉత్తర్‌ప్రదేశ్‌లోని అయోధ్య రామ మందిరంలో అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. గత ఏడాది మాదిరిగానే, ఈసారి కూడా మధ్యాహ్నం 12 గంటలకు బాల రాముడి నుదుటిపై సూర్య కిరణాలు ప్రసరించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ సూర్య తిలకాన్ని భక్తులు ఆసక్తిగా వీక్షించారు. ఈ సందర్భంగా ఆలయమంతా గుడి గంటల శబ్దాలతో మార్మోగింది. అర్చకులు బాలరాముడికి హారతినిచ్చి ప్రత్యేక - మిగతా 2 లో

## చమురు ట్యాంకర్‌ను ధ్వంసం చేసిన ఇరాన్



- హర్మూజ్‌లో తీవ్ర ఉద్రిక్తత
- హర్మూజ్ జలసంధిలో ఆయిల్ ట్యాంకర్‌పై ఐఆర్జీసీ దాడి
- అనుమతి లేకుండా ప్రవేశించడంతో క్షిపణులతో దాడి
- దాడికి గురైంది పాకిస్థాన్ నౌక అని కథనాలు
- ఇప్పటికే గల్ఫ్‌లో నిలిచిపోయిన 85కి పైగా నౌకలు
- ప్రపంచవ్యాప్తంగా 100 డాలర్లు దాటిన ముడి చమురు ధరలు

**ఢిల్లీ :** ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధంతో అట్టుడుకుతున్న పర్షియన్ గల్ఫ్‌లో మరోసారి ఉద్రిక్తత తారస్థాయికి చేరింది. హర్మూజ్ జలసంధిలో తమ నిబంధనలు ఉల్లంఘించి ప్రవేశించిన ఓ ఆయిల్ ట్యాంకర్‌పై ఇరాన్ రివల్యూషనరీ - మిగతా 2 లో

## ఆంధ్రప్రదేశ్‌లో భగ్గుమంటున్న ఎండలు



- 41 మండలాలకు వడగాలుల హెచ్చరిక
- నిన్న 9 మండలాల్లో తీవ్ర వడగాలుల హెచ్చరిక
- మరో 32 మండలాల్లో సాధారణ వడగాలులు వీచే అవకాశం
- శనివారం ఏకంగా 90 మండలాలకు వడగాలుల అలర్ట్
- ఉష్ణోగ్రతలు 42 డిగ్రీల వరకు చేరవచ్చని అంచనా
- ప్రజలు మధ్యాహ్నం బయటకు రావద్దని అధికారుల సూచన


**అమరావతి :** ఆంధ్రప్రదేశ్‌లో ఎండల తీవ్రత ఒక్కసారిగా పెరుగుతోంది. మార్చి నెల ముగియకముందే భానుడు భగభగమంటున్నాడు. ఈ నేపథ్యంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) పలు ప్రాంతాలకు వడగాలుల హెచ్చరిక జారీ చేసింది. రాష్ట్రంలోని 9 మండలాల్లో తీవ్ర వడగాలులు, - మిగతా 2 లో

# కఠిన సమయాల్లోనే నాయకత్వ పటిమ తెలుస్తుంది

- ప్రధాని మోదీపై చంద్రబాబు ప్రశంసలు
- పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకం తగ్గింపు
- కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతించిన సీఎం చంద్రబాబు
- ప్రధాని మోదీ నాయకత్వంపై ప్రశంసల వర్షం
- సామాన్యుడికి మేలు చేసే నిర్ణయమన్న ముఖ్యమంత్రి
- కేంద్ర హోంమంత్రి అమిత్ షా ట్వీట్‌ను రీపోస్ట్ చేసిన చంద్రబాబు



**అమరావతి :** పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్వాగతించారు. ఇది ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని తీసుకున్న బలమైన నిర్ణయమని ఆయన అభివర్ణించారు. ఈ మేరకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన ట్వీట్‌ను చంద్రబాబు తన సోషల్ మీడియా ఖాతాలో రీపోస్ట్ చేస్తూ తన అభిప్రాయాన్ని పంచుకున్నారు."కఠినమైన,సవాలుతో కూడిన సమయాల్లోనే నిజమైన నాయకత్వ పటిమ బయటపడుతుంది.నేను ఎప్పుడూ చెప్పే మాట ఇదే. ప్రపంచవ్యాప్తంగా క్లిష్ట పరిస్థితులు నెలకొన్నప్పటికీ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం స్థిరంగా ముందుకు సాగుతోంది. అలాంటి నాయకుడు మనకు ఉండటం దేశ ప్రజల అదృష్టం.కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయం అత్యంత బలమైన, ప్రజా కేంద్రకమైన చర్య. ఆంధ్రప్రదేశ్ తరఫున మేం ఈ నిర్ణయాన్ని మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నాం. అంతర్జాతీయంగా పెరుగుతున్న ధరల ప్రభావం నుంచి సామాన్యుడిని రక్షించడానికి ఈ నిర్ణయం ఎంతగానో సహాయపడుతుంది.నేడు అనేక దేశాలు తమ - మిగతా 2 లో



# సంపాదకీయం

## ఉద్యమంలో భవిష్యత్తును ఒడ్డింది విద్యార్థులే!



ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిన తెలంగాణ ఉద్యమంలో అసలు ఉద్యమకారులెవరు? వారిని ఎలా గుర్తించాలి, గుర్తించినా అందులో ఎవరిని ఆదుకోవాలి? లక్షల్లో, కోట్లలో ప్రజలు ఉద్యమించినప్పుడు ప్రతి ఒక్కరినీ ప్రభుత్వం ఆదుకోవడం కష్టమే కావచ్చు. కానీ ఉద్యమం కోసం ప్రాణాలు విడిచిన అమరవీరుల కుటుంబాలను ఆదుకోవడం ఎంత ముఖ్యమో, 2009 నుంచి 2014 మధ్య కాలంలో కాలేజీల్లో, యూనివర్సిటీల్లో చదువుకుంటూ ఉద్యమం చేసిన విద్యార్థులను ఆదుకోవడమూ అంతే ముఖ్యం. ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొంటూ తమ జీవితాలను లెక్కచేయకుండా భవిష్యత్తు బాగుంటుంది కదా అనే నమ్మకంతో ఉద్యమంలో పాల్గొన్న నాటి విద్యార్థులే, అవును 2009 నుంచి 2014 వరకు డిగ్రీ, పీజీ విద్యార్థులే ఉద్యమకారుల్లో ముందు వరుసలో ఉండాలి. ఎప్పుడు బంద్ ఉంటుందో తెలియదు, ఎప్పుడు పరీక్షలు ఉంటాయో తెలియదు. ఆ ఐదేళ్లు కాలేజీల్లో, యూనివర్సిటీల్లో విద్యార్థులు నిత్యం బంద్‌లు పాటిస్తూ ప్రత్యక్ష ఉద్యమంలో పాల్గొన్నారు. రాజకీయ జేఏసీ అయినా టీఆర్ఎస్ పార్టీ అయినా, ప్రజా విద్యార్థి సంఘాలైనా... ఎవరు పిలుపునిచ్చినా విద్యార్థులు రోడ్డెక్కారు. ఒకానొక సమయంలో పరీక్షలను సైతం బహిష్కరించి ఉద్యమించారు. అందరి ఉద్యమ ఫలితంగా రాష్ట్రం ఏర్పడింది. ముందైతే తెలంగాణ అమరవీరుల కుటుంబాలను ఆదుకుంటే చాలు, మనమెలాగైనా బతికేస్తాం అని ప్రతి సామాన్య విద్యార్థి ఉద్యమకారుడు అనుకునేవాడు. అయితే పన్నెండేళ్లుగా అమరవీరుల కుటుంబాల సంఖ్యను తేల్చలేదు. కొంతమంది ఉద్యమకారులకు రాజకీయ అవకాశాలు వచ్చాయి కానీ, అసలు ఉద్యమకారుడు ఇంకా గుర్తింపు పొందటం లేదు. నాడు ఉద్యమ హోరులో చదువును పక్కన పెట్టిన విద్యార్థులు నేటికీ స్థిరపడలేకపోతున్నారు. ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులు ఇంగ్లీష్ భాషపై, అసలు చదువులపైనే పట్టు కోల్పోయారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక ఉద్యోగాలు వస్తాయి అని ఆశపడ్డారు కానీ, పెరుగుతున్న పోటీని తట్టుకుని ముందుకు సాగే శక్తి అప్పటి విద్యార్థులకు ఉందా అంటే చాలా తక్కువనే చెప్పాలి. తెలంగాణ రాష్ట్రంలో దేశానికి ఆదర్శంగా నిలిచే ఐటీ రంగం అభివృద్ధి చెందింది కానీ అందులో ఉద్యమ విద్యార్థులు ఎంతమంది ఉంటారు? ఐటీ రంగంలో రాణించే శక్తి నాటి విద్యార్థులకు ఎక్కడిది? నిత్యం రోడ్డుపై 'జై తెలంగాణ' నినాదాలు చేస్తూ తిరిగిన పిడికిళ్లకు కంప్యూటర్ ముందు కూర్చుని కీబోర్డ్‌తో పనిచేసే అవకాశం ఉంటుందా? పరిమితికి మించి లేని ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎంతమంది విద్యార్థి ఉద్యమకారులు ఉన్నారు? ఇంకా చెప్పాలంటే అందరివి భూమి లేని బతుకులే! కొంతమంది జర్నలిజంలో, మరికొంతమంది రాజకీయాల్లో, ఇంకొంతమంది యూట్యూబర్లుగా రాణిస్తున్నారు. ప్రభుత్వాలు ఉద్యమకారులకు ఏదైనా చేయాలనుకుంటే ముందు నాటి విద్యార్థి ఉద్యమకారులను గుర్తించాలి. 200914 మధ్య చదివిన ప్రతి విద్యార్థి ఉద్యమకారుడే. ప్రభుత్వం వీరిందరి వివరాలను ఆయా కాలేజీలు, యూనివర్సిటీల నుంచి తెప్పించుకుని, అందులో స్థిరపడనివారిని గుర్తించి వారికి అండగా నిలబడాలి. ప్రస్తుత ప్రభుత్వం ఉద్యమకారులను ఆదుకోవడానికి కమిటీ వేయాలని యోచనలో ఉన్నట్టు వార్తలొస్తున్నాయి. ముందుగా ఉద్యమకారుల జాబితాలో విద్యార్థులను లెక్కలోకి తీసుకోవాలి. వారందరికీ హానరరీ పెన్షన్ కానీ, ఏదైనా వ్యాపారం చేసుకునే వెసులుబాటుగానీ కల్పించే విధంగా సబ్సిడీ రుణాలు అందించాలి. విద్యార్థుల జీవితాలకు ఒక భరోసా కల్పించి, రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యం చేసినప్పుడే తెలంగాణ ఉద్యమానికి సార్థకత!

## కఠిన సమయాల్లోనే నాయకత్వ పటిమ తెలుస్తుంది

**మొదటిపేజీ తరువాయి** – పౌరులపై ఇంధన ధరల భారాన్ని మోపుతుంటే, భారతదేశం మాత్రం తన ప్రజలకే ప్రథమ స్థానం ఇస్తూ ప్రత్యేకంగా నిలుస్తోంది. ప్రజల పట్ల ఎన్డీయే ప్రభుత్వానికి ఉన్న తిరుగులేని నిబద్ధతకు ఇదే నిదర్శనం" అంటూ చంద్రబాబు పేర్కొన్నారు.

## మార్కాపురం బస్సు ప్రమాదం కేసులో బస్సు యజమాని అరెస్ట్

**మొదటిపేజీ తరువాయి** – ప్రకాశం జిల్లా మార్కాపురం సమీపంలో జరిగిన ఘోర బస్సు ప్రమాదం తెలుగు రాష్ట్రాలను కలచివేసింది. 14 మంది ప్రాణాలను బలిగొన్న ఈ విషాద ఘటనపై పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. ప్రమాదానికి డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని ప్రాథమిక విచారణలో తేలడంతో, బస్సు డ్రైవర్ యువరాజుతో పాటు యజమాని హరికృష్ణను పోలీసులు అరెస్ట్ చేశారు. డ్రైవర్‌ను ప్రధాన నిందితుడిగా చేరుస్తూ సెక్షన్ 304ఏ కింద కేసు నమోదు చేశారు. ప్రస్తుతం వీరిద్దరిని పోలీసులు విచారిస్తున్నారు. విచారణ ముగిసిన అనంతరం కోర్టులో హాజరుపరచనున్నారు. కోర్టు వీరికి రిమాండ్ విధించే అవకాశం ఉంది. టిప్పర్ లారీని ఢీకొట్టిన ఈ ప్రమాదంలో 13 మంది సజీవ దహనం కాగా, చికిత్స పొందుతూ ఒక బాలుడు మరణించాడు.

## చమురు కంపెనీలకు చెక్ పెట్టిన కేంద్రం

**మొదటిపేజీ తరువాయి** – సరఫరా చేయడమే లాభదాయకంగా మారుతుంది. తద్వారా మన దేశంలోని పెట్రోల్ బంకుల వద్ద ఏర్పడుతున్న కృత్రిమ కొరతకు చెక్ పడనుంది. ఈ నిర్ణయం ముఖ్యంగా రిలయన్స్, నయారా వంటి ప్రైవేట్ రిఫైనరీలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఎందుకంటే వారు అంతర్జాతీయ మార్కెట్‌లో వచ్చే భారీ లాభాల కోసం ఎగుమతులకు ప్రాధాన్యత ఇస్తుంటారు. ఇప్పుడు ప్రభుత్వం విధించిన ఈ పన్ను వల్ల, వారు తప్పనిసరిగా దేశీయ అవసరాలకే మొగ్గు చూపాల్సి ఉంటుంది. యుద్ధం వల్ల ప్రపంచవ్యాప్తంగా చమురు సంక్షోభం ఉన్నప్పటికీ, భారత్‌లో పెట్రోల్, డీజిల్ ధరలు సామాన్యుడికి అందుబాటులో ఉంచడమే లక్ష్యంగా కేంద్రం ఈ సాహసోపేతమైన అడుగు వేసింది.

## భద్రాచలంలో ఘనంగా సీతారాముల కల్యాణోత్సవం

**మొదటిపేజీ తరువాయి** – ఇదే సందర్భంగా ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న భద్రాద్రి ఆలయ అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. శ్రీరామనవమి నాడు పాలకులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించడం గోల్కొండ నవాబుల కాలం నుంచి వస్తున్న ఆనవాయితీ. ఈ సంప్రదాయాన్ని గౌరవిస్తూ సీఎం రేవంత్ రెడ్డి తన అర్ధాంగితో కలిసి స్వామివారికి వస్త్రాలు అందజేశారు. తెలంగాణ సీఎంగా బాధ్యతలు చేపట్టాక, భద్రాద్రి రాముడిపై తన భక్తిని చాటుకుంటూ ఆలయ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నారు. భద్రాచలం ఆలయాన్ని మూడు దశల్లో విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం మొత్తం రూ.586 కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందులో భాగంగా తొలి దశలో రూ.351 కోట్లతో చేపట్టనున్న పనులకు ముఖ్యమంత్రి శ్రీరామనవమి రోజునే భూమిపూజ చేసి శ్రీకారం చుట్టారు.

# అయోధ్యలో వైభవంగా శ్రీరామ నవమి

**మొదటిపేజీ తరువాయి** – పూజలు చేశారు. మరోవైపు, ప్రధాని నరేంద్ర మోదీ కూడా శ్రీరామ నవమి వేడుకల్లో వర్చువల్‌గా పాల్గొన్నారు. అయోధ్యలో జరిగిన సూర్య తిలక్ కార్యక్రమాన్ని ఆయన వర్చువల్‌గా వీక్షించారు. ఇక, చైత్ర నవరాత్రుల ముగింపు సందర్భంగా జరుపుకునే ఈ రామ నవమి పర్వదినాన్ని దేశవ్యాప్తంగా భక్తులు ఘనంగా నిర్వహిస్తున్నారు. శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ జరిగిన తర్వాత వచ్చిన మూడో శ్రీరామ నవమి ఇది. దీంతో భక్తులు పెద్ద ఎత్తున రామున్ని దర్శించుకోవడానికి అయోధ్యకు చేరుకున్నారు.

**సూర్య తిలకం కోసం అత్యాధునిక సాంకేతికత**

అయోధ్యలో ప్రతి ఏటా జరిగే సూర్య తిలకం కార్యక్రమాన్ని భక్తులు ఎంతో ఆసక్తిగా తిలకిస్తారు. ఇంతటి విశేషాన్ని సాధించేందుకు అత్యాధునిక సాంకేతికతను వినియోగించారు అధికారులు. ప్రతి ఏటా శ్రీరామ నవమి రోజున బాలరాముడి విగ్రహం నుదుటిపై సూర్యకిరణాలు పడేలా ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయం మూడో అంతస్తులో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం గడియారం పనిచేసే విధానాన్ని పోలి ఉండే గేర్ టీత్ మెకానిజాన్ని వినియోగించారు. సూర్య కాంతి కదలికను అనుసరించి కాంతి దిశను నియంత్రించేలా ఈ వ్యవస్థ రూపొందించారు. సూర్యకాంతిని గ్రహించే పరికరంతో పాటు మరో నియంత్రణ పరికరాన్ని ఏర్పాటు చేశారు. ఈ పరికరం అద్దాన్ని 365 రోజుల పాటు స్వల్పంగా కదుపుతూ, తద్వారా ప్రతి సంవత్సరం రామనవమి రోజున కాంతి కచ్చితంగా నిర్ణీత స్థానానికి చేరేలా చేస్తుంది. అదేవిధంగా, ఆలయ శిఖర భాగంలో సూర్యకాంతిని స్వీకరించే ప్రత్యేక పరికరాన్ని అమర్చారు. అక్కడినుంచి పైపుల ద్వారా కాంతి గర్భగుడిలోకి చేరేలా వ్యవస్థను రూపొందించారు. ఈ పైపుల్లో కుంభాకార, పుటాకార కటకాలను అమర్చి కాంతిని సరైన దిశలో కేంద్రీకరించేలా చేశారు. ఫలితంగా, సూర్యకిరణాలు బాలరాముడి నుదుటిపై తిలకం వలే ప్రకాశిస్తుంది.

**అయోధ్యలో భక్తుల సందడి**

శ్రీరామ నవమి సందర్భంగా అయోధ్యలో దేశ విదేశాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దీంతో అధికారులు భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టం చేశారు. భక్తులు భారీగా తరలిరావడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తుగా అన్ని భద్రతా చర్యలు తీసుకున్నామని అధికారులు పేర్కొన్నారు. డ్రోన్లు, సీసీటీవీ కెమెరాల సహాయంతో పరిస్థితిని పర్యవేక్షిస్తున్నామని లఖ్‌నవూ జోన్ అదనపు డీజీపీ ప్రవీణ్ కుమార్ వెల్లడించారు.

**దేశ ప్రజలకు శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్రపతి ముర్ము**

శ్రీరామ నవమి సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. శ్రీరాముని మహోన్నత జీవిత ప్రయాణం మనకు సత్యం, న్యాయం, సద్గుణాల మార్గాన్ని అనుసరించి సార్థకమైన జీవితాన్ని గడపడానికి మార్గనిర్దేశం చేస్తుందని ముర్ము పేర్కొన్నారు. సమాజం పట్ల మన కర్తవ్యాలను నిర్వర్తించడానికి శ్రీరాముని జీవితం మనందరికి స్ఫూర్తిదాయకం అన్నారు. రాముని గాథలోని బోధనలను ఆకళింపు చేసుకుని, ఆలోచనలు, మాటలు, చేతలతో దేశానికి సేవ చేస్తామని ప్రతిజ్ఞ చేయాలని ఈ సందర్భంగా ముర్ము పౌరులను కోరారు.




## చమురు ట్యాంకర్‌ను ధ్వంసం చేసిన ఇరాన్



**మొదటిపేజీ తరువాయి** – గార్డ్స్ కార్ప్స్ (ఐఆర్జీసీ) క్షిపణులతో దాడి చేసి ధ్వంసం చేసింది. ఈ ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. దాడికి గురైన ట్యాంకర్ పాకిస్థాన్ జెండాతో ఉన్నట్లు పలు కథనాలు సూచిస్తున్నాయి. ఇరాన్ హెచ్చరికలను పెడచెవిన పెట్టి జలసంధిని దాటేందుకు ప్రయత్నించడంతోనే ఈ దాడి చేసినట్లు ఇరాన్ వర్గాలు తెలిపాయి. మరోవైపు, పాకిస్థాన్ జెండా చాటున చమురును అక్రమంగా అమెరికాకు తరలిస్తున్నారని, దానికి ప్రతీకారంగానే ఈ దాడి జరిగిందనే కథనాలు వినిపిస్తున్నాయి. ట్యాంకర్‌కు మంటలు అంటుకుని, పూర్తిగా ధ్వంసమైన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ ఘటనలో సిబ్బంది ప్రాణనష్టంపై ఇంకా స్పష్టత రాలేదు. ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ దళాలు దాడులు చేసినప్పటి నుంచి హార్మూజ్ జలసంధిని ఇరాన్ తన నియంత్రణలోకి తీసుకుంది. తమ అనుమతి లేకుండా ఏ నౌక ప్రవేశించరాదని ఆంక్షలు విధించింది. దీంతో ప్రపంచ చమురు సరఫరాలో 20 శాతం స్తంభించిపోగా, 85కి పైగా ట్యాంకర్లు గల్ఫ్‌లోనే చిక్కుకుపోయాయి. మార్చి 11న కూడా థాయ్‌లాండ్‌కు చెందిన నౌకపై దాడి జరిగింది. ఈ సంక్షోభం కారణంగా అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు భగ్గుమంటున్నాయి. బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 100 డాలర్లను దాటింది. తాజా ఘటనతో ఈ ప్రాంతంలో యుద్ధ మేఘాలు మరింత దట్టమయ్యాయి. సంక్షోభం ముదరకుండా దౌత్యపరమైన ప్రయత్నాలు జరుగుతున్నాయి.

## ఆంధ్రప్రదేశ్‌లో భగ్గుమంటున్న ఎండలు



**మొదటిపేజీ తరువాయి** – మరో 32 మండలాల్లో సాధారణ వడగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. కొన్ని జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 40 నుంచి 42 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేసింది. విపత్తుల శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం.. పార్వతీపురం మన్యం జిల్లాలోని గుమ్మలక్ష్మీపురం, కురుపాం, అల్లూరి సీతారామరాజు జిల్లాలోని చింతూరు, కూనవరం, వి.ఆర్.పురం, కాకినాడ జిల్లాలోని జగ్గంపేట, తూర్పుగోదావరి జిల్లాలోని కోరుకొండ, ఎన్టీఆర్ జిల్లాలోని జి. కొండూరు, ఇబ్రహీంపట్నం మండలాల్లో తీవ్ర వడగాలులు నమోదయ్యే అవకాశం ఉంది. వీటితో పాటు ఎన్టీఆర్ జిల్లాలో 7, విజయనగరంలో 4, ఏలూరులో 4, పార్వతీపురం మన్యంలో 3, అల్లూరి జిల్లాలో 3, తూర్పుగోదావరి, కృష్ణా జిల్లాల్లో రెండేసి చొప్పున, కాకినాడ, గుంటూరు జిల్లాల్లో ఒక్కో మండలం చొప్పున మొత్తం 32 మండలాల్లో వడగాలులు వీస్తాయని పేర్కొంది. నేటి పరిస్థితి మరింత తీవ్రంగా ఉండవచ్చని, ఏకంగా 90 మండలాల్లో వడగాలులు నమోదయ్యే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ప్రజలు మధ్యాహ్నం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వీలైనంత వరకు ఇళ్లకే పరిమితం కావాలని, బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపీ వంటివి వాడాలని సూచించారు. వృద్ధులు, గర్భిణులు, బాలింతలు మరింత జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు.

# ఆటల బరిలోకి తెలంగాణ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

**మొదటిపేజీ తరువాయి** – నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెల 28, 29 తేదీల్లో హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియం వేదికగా ఈ క్రీడా పోటీలు జరగనున్నాయి. ఈ విషయాన్ని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ శాసనసభలో అధికారికంగా ప్రకటించారు. ఈ క్రీడల నిర్వహణ కోసం పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఛైర్మన్‌గా, క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి కో-ఛైర్మన్‌గా ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేసింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత శాసనసభ్యులకు ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించడం ఇదే తొలిసారి కావడం విశేషం.

**రవీంద్ర భారతిలో సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాటు**

ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల మధ్య స్నేహపూర్వక వాతావరణం పెంపొందించడంతో పాటు రాష్ట్ర ప్రజల్లో క్రీడా స్ఫూర్తిని నింపడమే ఈ పోటీల ముఖ్య ఉద్దేశమని మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి తెలిపారు. క్రీడలతో పాటు రవీంద్ర భారతిలో సాంస్కృతిక కార్యక్రమాలను కూడా ఘనంగా ఏర్పాటు చేయనున్నారు. ఈ పోటీల నిర్వహణ కమిటీ కన్వీనర్‌గా ఎమ్మెల్యే మకన్ సింగ్ రాజ్ ఠాకూర్‌తో పాటు మరో 13 మంది సభ్యులను నియమించారు. గురువారం నాడు కమిటీ సభ్యులు సమావేశమై ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ నెల 28న మధ్యాహ్నం 3:30 గంటలకు ఎల్బీ స్టేడియంలో క్రీడలు ప్రారంభమవుతాయని కమిటీ స్పష్టం చేసింది. అంతకుముందు మంత్రులు, స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డి.. స్పీకర్‌ను కలిసి స్పోర్ట్స్ కిట్‌ను అందజేశారు.



# ఏప్రిల్ 25న కొత్త పార్టీ పేరు ప్రకటించనున్న కవిత

**మొదటిపేజీ తరువాయి** – తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తన రాజకీయ పార్టీ ఏర్పాటుపై కీలక ప్రకటన చేశారు. ఏప్రిల్ 25వ తేదీన తన పార్టీని అధికారికంగా ప్రకటించనున్నట్టు తెలిపారు. తాను సొంతంగా ఒక కొత్త రాజకీయ పార్టీని స్థాపించబోతున్నట్లు ఇప్పటికే ఆమె పలు సందర్భాల్లో వెల్లడించడం తెలిసిందే. మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లోని అధ్వయ కన్వెన్షన్‌లో ఏప్రిల్ 25న ఉదయం 8 గంటలకు పార్టీ ఆవిర్భావ సభను నిర్వహించనున్నట్లు కవిత పేర్కొన్నారు. ఈ వేదికపై పార్టీ పేరు, జెండాను ఆవిష్కరించనున్నట్లు ఆమె వివరించారు. నేడు శ్రీరామనవమి పర్వదినం కావడంతో, పార్టీకి సంబంధించిన కీలక అప్ డేట్ ఇస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా కవిత స్పందిస్తూ, "ఇప్పటివరకు మగవాళ్లు పెట్టిన పార్టీలనే చూశారు. ఇప్పుడు ఓ తెలంగాణ ఆడబిడ్డగా నేను పార్టీ పెడితే ఎలా ఉంటుందో మీరే చూస్తారు" అని అన్నారు. తమ పార్టీలో యువత, మహిళలకు సముచిత స్థానం కల్పిస్తామని ఆమె హామీ ఇచ్చారు. తెలంగాణ జాగృతి ద్వారా ఇప్పటికే ప్రజల్లో ఉన్న కవిత, ఇప్పుడు ప్రత్యక్ష రాజకీయాల్లోకి సొంత పార్టీతో అడుగుపెట్టనుండటం ఆసక్తి రేపుతోంది. పార్టీ విధివిధానాలు, భవిష్యత్ కార్యాచరణపై ఏప్రిల్ 25న పూర్తి స్పష్టత రానుంది.



## కేరళ అసెంబ్లీ ఎన్నికల స్టార్ క్యాంపెయినర్ల జాబితాలో రేవంత్ రెడ్డి

**మొదటిపేజీ తరువాయి** – రాబోయే అసెంబ్లీ ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ, కేరళ, అసోం, పుదుచ్చేరిలలో స్టార్ క్యాంపెయినర్ల జాబితాను విడుదల చేసింది. కేరళ అసెంబ్లీ ఎన్నికల స్టార్ క్యాంపెయినర్ల జాబితాలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారు. గోవాలోని పోండా ఉప ఎన్నిక క్యాంపెయినర్ల జాబితాలోనూ ఆయన పేరు ప్రకటించారు. పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల కోసం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్‌లను స్టార్ క్యాంపెయినర్ల జాబితాలో చేర్చారు. కేరళ, అసోం, పుదుచ్చేరిలకు 40 మంది చొప్పున స్టార్ క్యాంపెయినర్లను ప్రకటించింది. ఇందులో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మల్లుభట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్‌ల పేర్లు ఉన్నాయి. స్టార్ క్యాంపెయినర్లను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నియమించారు.



## కమనీయం...రాములోరి కళ్యాణం....

**దర్జీ గుడిలో వైభవంగా శ్రీ సీతారాముల కళ్యాణ వేడుకలు**



**సికింద్రాబాద్, మార్చి 27 ( ప్రజా మంటలు):** శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా సికింద్రాబాద్ రెజిమెంటల్ బజార్‌లోని శ్రీ కాశీ విశ్వనాథ స్వామి దేవాలయం (దర్జీ గుడి)లో శ్రీ సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో జరిగిన ఈ వేడుకలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గత కొన్ని సంవత్సరాలుగా కొనసాగుతున్న ఆనవాయితీ మేరకు సికింద్రాబాద్ మేరు సంఘం జోన్3 తరఫున స్వామివారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. తెలంగాణ మేరు సంఘం రాష్ట్ర నాయకులు కొవ్వూరి భాస్కర రావు, పొడిశెట్టి నర్సింగ్ రావు, డికొండా నర్సింగ్ రావు, సంఘేవారు, ఓదెల సత్యనారాయణ, శ్రీనివాస్ తదితరులు ఈ సమర్పణ కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. మేరు సంఘం జోన్3 అధ్యక్షులు తాళ్ల చంద్రశేఖర్, పొడిశెట్టి శ్యామ్, నందగిరి నరేష్, ఓదెల నరసయ్య, కొట్టూరి రాజ్‌కుమార్, మాడిశెట్టి అజయ్, కీర్తి నిఖిల్ కుమార్, ఓదెల రమేష్, నరేందర్, భాస్కర్, రామగిరి శ్రీనివాస్, రామగిరి నరేందర్, శైలేందర్, టి.డి. వెంకటేశ్వర్లు, డికొండ ఉపేందర్, యాదగిరి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రం సరిహద్దు సమస్య

**పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి**



**జగిత్యాల మార్చి 27 (ప్రజా మంటలు) :**ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసిన జగిత్యాల రూరల్ మండలం వంజరిపల్లి గ్రామ నాయకులు ప్రజలు. వంజరుపల్లి గ్రామ శివారులో వరి ధాన్యం కొనుగోలు కేంద్రానికి సంబంధించి స్థలం విషయంలో సరిహద్దు సమస్య పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ కి వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే రెవెన్యూ మరియు అటవీ శాఖ అధికారులకు ఫోన్ చేసి గ్రామాల మధ్య సరిహద్దు వివాదాన్ని త్వరితగతిన పరిష్కరించి న్యాయం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంగమల్లయ్య ,మాజీ ఎంపిటిసి కుదుకల లక్ష్మణ్,గ్రామస్తులు ఉన్నారు.

## ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు మంచి లక్ష్యాన్ని ఎంపిక చేసుకుని పీల్ మంత్రాన్ని అనుసరించాలి

**ప్రొఫెసర్ వాసాల వరప్రసాద్**




**రామడుగు మార్చి 27 (ప్రజా మంటలు) :**స్థానిక శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ మరియు సైన్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ 4వ యూనిట్ వాలంటీర్లు ఏడు రోజుల ప్రత్యేక శిబిరం రామడుగు మండలం మోతే గ్రామంలో నిర్వహించుచున్నారు. శిబిరంలో నాలుగవ రోజున శ్రీరామనవమిని పురస్కరించుకుని వివిధ రామాలయాలలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. దానితోపాటు వీధులలో స్థానిక ప్రజలకి రానున్న కాలంలో జనాభా లెక్కలు ఆవశ్యకతను వివరిస్తూ... ప్రభుత్వాలు అనుసరించే పథకాలు అనుసంధానించబడి, నియోజకవర్గాల పునర్విభజన సైతం ఈ జనాభా లెక్కల ఆధారంగానే నిర్ణయించబడుతుందని, కావున ప్రతి ఒక్కరు విధిగా తమ వివరాలు ప్రతి ఒక్కరూ ఎన్యుమరేటర్లకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రథమ పౌరురాలు శ్రీమతి బత్తిని భవాని ప్రవీణ్ కుమార్ , ఉప సర్పంచ్ శ్రీ కుమ్మరి అనిల్ కుమార్ , గ్రామ పంచాయతీ సెక్రెటరీ బాబి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి లక్ష్మణ్ కుమార్ మరియు వెంకటేశ్వర్లు అంగన్వాడీ టీచర్ మరియు గ్రామ పౌరులు యువకులు, విద్యావేత్తలు పాల్గొన్నారు. తదనంతరం మధ్యాహ్నం భోజన విరామం తర్వాత హిందీ ప్రొఫెసర్ వాసాల వరప్రసాద్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల జగిత్యాల మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు మంచి లక్ష్యాన్ని ఏర్పరచుకొని పీల్ మంత్రాన్ని అనుసరించినట్లయితే ఎంత పెద్ద లక్ష్యాన్నైనా అలవోకగా చేరుకుంటారని ప్రతి పదాన్ని విడమరిచి చెప్పారు పి అనగా ప్లానింగ్, ఈ అనగా ఎగ్జిక్యూషన్, ఏ అనగా అచీవ్మెంట్, ఎల్ అనగా లీడింగ్ లైఫ్ విత్ లవ్ క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ పడాల తిరుపతి డాక్టర్ వాసాల వరప్రసాద్ మంచి హిందీ కవి మరియు రచయిత అని, నాయకత్వ లక్షణాలు కలిగి ఉన్న వారిని పేర్కొని, వారికి ప్రోగ్రాం అధికారి మరియు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు శాలువాతో సన్మానించారు.

## వైభవంగా నిజాంపేట్‌లో సీతారాముల కళ్యాణం



**సికింద్రాబాద్, మార్చి 27 (ప్రజామంటలు):**నిజాంపేటలోని బండారి లేఔట్ లో ఉన్న దక్షిణముఖ అభయ ఆంజనేయ స్వామి దేవాలయంలో శ్రీ సీతారాముల కళ్యాణం ఘనంగా నిర్వహించారు. భక్తులు అశేషంగా పాల్గొని స్వామివారిని దర్శించుకుని ఆశీర్వాదాలు పొందారు. ఈ కార్యక్రమానికి నిజాంపేట్ బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షులు పి. వెంకటేశ్వర్ ముదిరాజ్, సచిన్, రాకేష్ ముదిరాజ్, శ్రావణ్, సందీప్ తదితరులు హాజరై సేవా కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేశారు.

## కంటోన్మెంట్ విలీనానికి ప్రభుత్వం కట్టుబాటు

**అసెంబ్లీలో మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి..**




**సికింద్రాబాద్,మార్చి 27 ( ప్రజామంటలు):** కంటోన్మెంట్ ప్రాంతంలోని నివాస ప్రాంతాలను మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేసే ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం నిబద్ధతతో ముందుకు తీసుకువెళ్తుందని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. గురువారం రాత్రి అసెంబ్లీలో ఆయన ఈ మేరకు ప్రకటన చేశారు. కంటోన్మెంట్ బోర్డును మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేయాలనే స్థానిక ప్రజల దీర్ఘకాల వాంఛను దృష్టిలో ఉంచుకుని, పౌర సేవలు రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో ఉంటే ఇతర ప్రాంతాల మాదిరిగానే కంటోన్మెంట్ ప్రాంతం కూడా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. విలీన ప్రక్రియ వేగవంతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అలాగే, కంటోన్మెంట్ ప్రాంత ప్రజల తాగునీటి సమస్య పరిష్కారం కోసం మహేంద్ర హిల్స్‌లో నీటి నిల్వ ట్యాంక్ నిర్మాణం చేపట్టినట్లు మంత్రి వెల్లడించారు. ఇక విలీన ప్రక్రియ ప్రారంభించడంతో పాటు నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నందుకు రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబుకు స్థానిక ప్రజల తరఫున ఎమ్మెల్యే శ్రీగణేశ్ కృతజ్ఞతలు తెలిపారు.

## శ్రీ సీతారాముల కళ్యాణోత్సవాల్లో మర్రి శశిధర్ రెడ్డి..



**హైదరాబాద్, మార్చి 27 ( ప్రజామంటలు ):** శ్రీరామనవమి సందర్భంగా పద్మారావు నగర్‌లోని శ్రీ పోల్ బాల్ హనుమాన్ దేవాలయంలో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది మాజీ మంత్రి, ఎన్‌డీఎంఏ మాజీ ఉపాధ్యక్షుడు, బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు మర్రి శశిధర్ రెడ్డి పాల్గొన్నారు. ఆయన వెంట బీజేపీ రాష్ట్ర యువ నాయకుడు మర్రి పురురవ రెడ్డి సహా పార్టీ ముఖ్య నాయకులు హాజరయ్యారు. అనంతరం పద్మారావు నగర్, న్యూ బోయిగూడ, రామ్‌గోపాల్‌పేట్, బేగంపేట్, అమీర్‌పేట్, సనత్‌నగర్ తదితర ప్రాంతాలలో నిర్వహించిన సీతారాముల కళ్యాణోత్సవాల్లో కూడా ఆయన పాల్గొన్నారు.

## ప్రముఖ చరిత్రకారుడు జైశెట్టి రమణయ్య మృతి..

**కేసీఆర్, కవిత సంతాపం**



**జగిత్యాల, మార్చి 27 (ప్రజా మంటలు):**ప్రముఖ చరిత్రకారుడు, రిటైర్డ్ లెక్చరర్ జైశెట్టి రమణయ్య (85) అనారోగ్యంతో మరణించారు. ఆదివారం 29 వ తేదీన జగిత్యాల లలో అంత్యక్రియలు నిర్వహిస్తారు. జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ సభ్యులు మంచాల కృష్ణ, అడ్వకేట్ నరేందర్, టి వి సూర్యం, తదితరులు పాల్గొన్నారు. బీసీ కమీషన్ మాజీ చైర్మన్ బి ఎస్ రాములు ఆయన తో ఉన్న పరిచయాన్ని గుర్తుచేసుకుని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. విద్యావేత్తగా, సమాజసేవకునిగా జగిత్యాల గర్వపడేవిధంగా వివిధవర్గలవారికి ఆయన సేవలను గుర్తుచేస్తూ, శాతవాహన హైస్కూల్ ప్రిన్సిపాల్ శ్రీమతి సిహెచ్ స్మితా రావు సంతాపం ప్రకటించారు. మాజీ మంత్రి రాజేశం గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, ఓజూ ఛైర్పర్సన్ తుల ఉమ, దావ వసంత తదితరులు సంతాపం ప్రకటించారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కె. చంద్రశేఖర్ రావు రమణయ్య మృతిపై సంతాపం వ్యక్తం చేశారు. సిద్దిపేటలో ఇంటర్మీడియట్ చదువుతున్న సమయంలో రమణయ్య వద్ద చరిత్ర పాఠాలు నేర్చుకున్న విషయాన్ని గుర్తు చేసుకున్నారు. 1971లో సిద్దిపేట జూనియర్, డిగ్రీ కాలేజీలో హిస్టరీ లెక్చరర్‌గా పనిచేసిన రమణయ్య, జగిత్యాలలో డాక్టరేట్ పొందిన తొలి పరిశోధకుల్లో ఒకరుగా గుర్తింపు పొందారు. "సౌత్ ఇండియా టెంపుల్స్" అనే గ్రంథంపై పరిశోధన చేసి పీహెచ్‌డీ సాధించారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కూడా రమణయ్య మృతిపై సంతాపం ప్రకటించారు.

## కమనీయం...రాములోరి కళ్యాణం....

**శ్రీ కళ్యాణ రామచంద్రస్వామి కళ్యాణ వేడుకలు**





**గొల్లపల్లి మార్చి 27 ( ప్రజా మంటలు):** శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా గొల్లపల్లి మండల కేంద్రంలో శ్రీ కళ్యాణ రామచంద్ర ఆలయం గుట్టపైన కళ్యాణం అంగరంగ వైభవంగా ఆలయ కమిటీ మరియు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తి శ్రద్ధలతో జరిగిన ఈ వేడుకలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు ఈ సందర్భంగా గత కొన్ని సంవత్సరాలుగా నుండి కొనసాగుతున్న అన్నదాన నిర్వహించారు స్వామివారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు కార్యక్రమంలో భక్తులకు మహిళల సేవకులు హనుమాన్ దీక్ష పరుల గ్రామకుల పెద్దలు యువత పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన వారికి పేరుపేరునా ఆలయ కమిటీ మరియు ఉత్సవ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## వర్షకొండలో ఘనంగా సీతారాముల కళ్యాణం






**ఇబ్రహీంపట్నం మార్చ్ 27 (ప్రజా మంటలు దగ్గుల అశోక్ ) :**ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని వర్షకొండ గ్రామం లో ఉన్న పంచముఖి శ్రీ ఆంజనేయ స్వామి ఆలయం లో శ్రీ సీత రాముల కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. గ్రామ సర్పంచ్ పొనుకంటి చిన్న వెంకట్, శైలజ దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు తలంబ్రాలు సమర్పించారు, భక్తులు తమ మొక్కులు చెల్లించుకొని, అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పొనుకంటి చిన్న వెంకట్, ఉప సర్పంచ్ జయ నర్సయ్య, అర్చకులు అన్వేష్ ఆచార్య,రామ ఆచార్య,ప్రవీణ్ శర్మ, గ్రామ కమిటీ సభ్యులు, హనుమాన్ దీక్ష స్వాములు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు,

## మార్కండేయ ఆలయంలో

**సీతారామచంద్ర స్వామి కళ్యాణ మహోత్సవం లో మంత్రి పొన్నం ప్రభాకర్**



**హుస్నాబాద్,మార్చి 27,(ప్రజా మంటలు) :**శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని మార్కండేయ స్వామి ఆలయంలో శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు స్వామివారికి,సీనియర్ పాత్రికేయులు కొండా లక్ష్మణ్ దంపతులు సీతాదేవికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంత్రి పొన్నం మాట్లాడుతూ స్వామివారి ఆశీస్సులతో రాష్ట్రమంతా సమృద్ధిగా వర్షాలు కురిసి పాడి పంటలు బాగా పండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. అలాగే ప్రజా పాలన ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ఎటువంటి అవరోధాలు లేకుండా విజయవంతంగా ముందుకు సాగాలని భగవంతుడిని ప్రార్థించినట్లు తెలిపారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, మాజీ సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య,మున్సిపల్ కౌన్సిలర్లు, హుస్నాబాద్ మండల పద్మశాలి సేవా సంఘ సభ్యులు, శ్రీ మార్కండేయ సహిత శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయ కమిటీ అధ్యక్షులు వెల్దండి లక్ష్మీపతి, ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి అరుణ, వడ్డేపల్లి లక్ష్మయ్య, కోశాధికారి పంతం కన్యాకుమారి, మాజీ ప్రజా ప్రతినిధులు, అఖిలపక్ష పార్టీ నాయకులు, పట్టణ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## జింఖానా గ్రౌండ్ లో మహిళా డాక్టర్ల క్రికెట్ లీగ్

**చీఫ్ గెస్ట్ లుగా హాజరైన మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మాజీమంత్రి కేటీఆర్**



**సికింద్రాబాద్, మార్చి 27 ( ప్రజా మంటలు):** డా. నారీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన వుమెన్ డాక్టర్స్ క్రికెట్ లీగ్ (డబ్ల్యూడీసీఎల్) సీజన్4 జింఖానా మైదానంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో సుమారు 1500 నుంచి 2000 మంది డాక్టర్లు, అధికారులు, ప్రేక్షకులు పాల్గొని మహిళా సాధికారత, ఫిట్‌నెస్, క్రీడా స్ఫూర్తిని చాటిచెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడుతూ...మహిళా వైద్యులు క్రీడల్లో చురుకుగా పాల్గొనడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు సమాజానికి ప్రేరణగా నిలుస్తాయని అన్నారు. గౌరవ అతిథులుగా సినీ, సామాజిక రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు పాల్గొని కార్యక్రమానికి మరింత ఆకర్షణ తీసుకొచ్చారు. ప్రముఖ హీరో సాయికుమార్ పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆర్గానిక్ వ్యవసాయం ప్రాధాన్యతపై ప్రత్యేక అవగాహన కల్పించారు. వ్యవసాయాన్ని సంరక్షించాల్సిన అవసరాన్ని నిర్వాహకులు వివరించారు. కార్యక్రమానికి పీవీ రావు, గణేష్, జీబీకే రావు తదితరులు విశేష సహకారం అందించారు. నిర్వాహక బృందంగా డా. కీర్తన, ఫణి, డా. భావ్య, డా. అనిత భల్లా, డా. చంద్రిక, సంధ్య, సుజాత, శివాని, డాక్టర్ కీర్తన తదితరులు కీలక పాత్ర పోషించి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా డా. కీర్తన తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు అందుకుని ప్రత్యేక గౌరవం పొందారు. మహిళా వైద్యుల క్రీడా పోటీలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని పలువురు అభిప్రాయపడ్డారు.

## కరీంనగర్ జిల్లాలో ఆర్బీఎల్ బ్రాంచీలో భారీ కుంభకోణం



కరీంనగర్ జిల్లాలోని కిసాన్‌నగర్ ఆర్బీఎల్ బ్రాంచీలో భారీ కుంభకోణం వెలుగుచూసింది. ఏడు మ్యూల్ ఖాతాల ద్వారా రూ.137 కోట్ల ఆర్థిక లావాదేవీలు జరిపినట్లు అధికారులు తెలిపారు. ఈ ఖాతాల ద్వారా అక్రమ లావాదేవీలకు పాల్పడినట్లు అధికారులు గుర్తించారు. చైనా దేశానికి చెందిన మోసగాళ్లతో కలిసి సాయిరామ్ అనే వ్యక్తి కమీషన్ మీద ఈ మోసాలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. ప్రతి లావాదేవీపై క్రిప్టో కరెన్సీ ద్వారా సాయిరామ్ రెండు శాతం కమీషన్ తీసుకున్నట్లు తేలింది. ఈ బ్యాంకులో ఈ తరహా మోసానికి సంబంధించి ఎనిమిది కేసుల్లో 13 మంది నిందితులను అరెస్టు చేసినట్లు కరీంనగర్ సీపీ వెల్లడించారు. నిందితులకు కమీషన్ ద్వారా రూ.2 కోట్ల వరకు వచ్చాయని తెలిపారు. ఈ కేసులో నిందితులుగా ఇంజినీరింగ్, డిగ్రీ, డిప్లొమా విద్యార్థులు ఉండటం గమనార్హం.

# బాటిళ్లు, డ్రమ్ముల్లో పెట్రోల్ నింపి ఇంట్లో స్టాక్ పెట్టుకుంటున్నారా

**ప్రమాదం పొంచి ఉన్నట్లే!**

**ముడి చమురు సరఫరా నిలిచిపోతుందనే వదంతులతో నగరం కలకలం**

**ఆందోళనతో పెట్రోల్ బంకులకు భారీగా తరలివస్తున్న వాహనదారులు**

**బాటిల్లో నిల్వ చేసి నిప్పుతో చెలగాటం!**



పశ్చిమ ఆసియాలో యుద్ధ ప్రభావం కారణంగా ముడి చమురు సరఫరా నిలిచిపోతుందనే వదంతులు రాష్ట్రవ్యాప్తంగా కలకలం సృష్టిస్తున్నాయి. పెట్రోల్, డీజిల్ నిల్వలు తగ్గిపోతున్నాయన్న వార్తలు సోషల్ మీడియాలో వేగంగా వైరల్ అవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆందోళన చెందిన వాహనదారులు పెద్ద సంఖ్యలో పెట్రోల్ బంకుల వద్దకు తరలివెళ్తున్నారు. మరికొందరు తమకు దొరికినంత ఇంధనాన్ని నిల్వ చేసుకుంటున్నారు. అవసరం ఉన్నప్పుడు దానిని వినియోగించుకునేందుకు 30 లీటర్ల డబ్బాలతో ప్రత్యక్షమవుతున్నారు. నిషేధాజ్ఞలను విస్మరించి డ్రమ్ములు, సీసాల్లో ఇంధనాన్ని రవాణా చేస్తూ నిల్వ చేస్తున్నారు. అలా తీసుకెళ్లి భద్రపరుస్తూ నిప్పుతో చెలగాటమాడుతున్నారు!

**అగ్నికి వేగంగా వ్యాపించే గుణం :** పెట్రోల్ అత్యంత వేగంగా మండే స్వభావం కలది. పెట్రోల్ సమీపంలో జరిగే ఒక చిన్న అజాగ్రత్త కూడా భారీ అగ్ని ప్రమాదానికి దారితీయవచ్చు. మంట వ్యాపించిన వెంటనే ఒక లీటరు పెట్రోల్‌లో 14 డైనమైట్ స్టిక్‌లకు సమానమైన పేలుడు శక్తి ఉంటుంది. దీనిని ఇంట్లో నిల్వ చేయడం వల్ల పొరుగు ఇంటికీ గణనీయమైన ప్రమాదం ఉంది. పెట్రోల్ ఆవిరులు గాలి కంటే బరువుగా ఉంటాయి. అవి నేల మీదుగా ప్రయాణించి దూరంగా ఉన్న మంటను లేదా విద్యుత్ స్పార్క్‌ను గ్రహించి మంటను ఆందోళనకరమైన వేగంతో వ్యాప్తింప జేస్తాయి. లూజ్ కంటైనర్లలో (టిన్‌లు, ప్లాస్టిక్ బాటిళ్లు) పెట్రోల్ తీసుకోవడం పూర్తిగా నిషేధం. వీటి నుంచి ఇంధనం లీకయినా ప్రమాదం జరిగే అవకాశాలు ఎక్కువ. అంతేకాకుండా పెట్రోల్ పొగలకు గురికావడం వల్ల శ్వాసకోసం సమస్యలు, మూర్ఛ, తలనొప్పి వచ్చే అవకాశం ఉంది. భారీ వాహనాలు, ఇంజిన్లు, పరిశ్రమల వినియోగంలో మాత్రమే పెట్రోల్‌ను నిల్వ చేసేందుకు అనుమతులు మంజూరు చేయబడుతుంది. ఇందుకూ నిబంధనల మేరకు లైసెన్సు తీసుకోవాలి. భద్రతా నిబంధనలు పాటించాలి. గతంలో బోరబండలోని ఎన్ఆర్ఆర్‌పురంలో అక్రమ పెట్రోల్ విక్రయ కేంద్రంలో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. విక్రయదారుడు మధ్యాహ్నం ఒక ఫ్యూయల్ స్టేషన్ నుంచి తీసుకొచ్చిన పెట్రోల్ క్యాన్లను కారులో నుంచి దింపుతుండగా ఈ సంఘటన జరిగింది. అదే సమయంలో అక్కడున్న చెత్తకు ఎవరో నిప్పు పెట్టడంతో అకస్మాత్తుగా పెట్రోల్ క్యాన్ పేలి మంటలు వ్యాప్తి చెందాయి. వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలి : అత్యవసర పరిస్థితుల్లో తప్ప బాటిళ్లో పెట్రోల్ నింపడాన్ని నిషేధిస్తూ నిబంధనలు అమలులో ఉన్నాయి. అయినా కూడా అత్యంత తప్పనిసరి పరిస్థితుల్లో తీసుకెళ్లాలన్నా బంకులో పెట్రోల్ బంకు సిబ్బంది రిజిస్ట్రేషన్ నంబర్‌తో పాటు పెట్రోల్ పట్టుకెళ్లిన వ్యక్తి ఫోన్ నంబర్ నమోదు చేయాలి. ప్రస్తుతం ఈ నిబంధనలు కేవలం కాగితంపైనే ఉన్నాయి. వీటిని ఏ పెట్రోల్ బంకు యాజమాన్యం కూడా ఆచరణలో అమలు చేయడం లేదు.

**రాత్రి, పగలు తేడా లేదు :** హైదరాబాద్‌లో వాహనదారులు పెట్రోల్, డీజిల్ సీఎన్‌జీ కొనుగోలు చేయడానికి భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఇంధన సరఫరాలు అయిపోతాయనే భయంతో, నగరవ్యాప్తంగా వాహనదారులు వివిధ పెట్రోల్ బంకుల వద్ద పగలు, రాత్రి అనే తేడా లేకుండా గంటల తరబడి క్యూలలో నిలబడుతున్నారు. హైదరాబాద్‌లోని మైండ్‌స్పేస్ బయోడైవర్సిటీ ఐటీ కారిడార్ రోడ్డుపై పొద్దున్నే వాహనాలు ఇంధనం కోసం బారులు తీరడం ప్రారంభించాయి.

**నో స్టాక్ బోర్డుల వల్లే ఇబ్బందులు :** గత రెండు రోజులుగా వాహనదారులు ఇంధనం కొనుగోలు చేయడానికి పెట్రోల్ బంకుల వద్ద క్యూలో నిలబడుతున్నారు. కొన్ని బంకుల వద్ద నో స్టాక్ బోర్డులను పెట్టడం జరిగింది. ఇంధన కొరతపై వదంతులను మరింత పెంచింది. కొన్ని ప్రాంతాలలో ఒక్కో వాహనానికి ఒక లీటరు పెట్రోల్ పోయడానికి కూడా బారులు తీరేందుకు కారణమైంది. ఫలితంగా డీలర్లు ఎలాంటి కొరతను ఎదుర్కోకుండా చూసేందుకు ఆదేశించారు. వినియోగదారుల రద్దీ కారణంగా మధ్యాహ్నానికే నిల్వలు అయిపోతున్నాయని అధికారులు చెబుతున్నారు.

# సీఎన్‌జీ కష్టాలు తీరేదెన్నడో

**గ్యాస్ కొరతతో అష్టకష్టాలు పడుతున్న ఆటోవాలాలు**

**సీఎన్‌జీ, ఎల్‌పీజీ కొరతతో ఆటో, క్యాబ్ డ్రైవర్లు, ప్రైవేట్ వాహనదారుల ఇబ్బందులు**

**గ్యాస్ కోసం వేచి ఉండాల్సి రావడంతో తమ ఉపాధికి గండి పడుతుందని ఆవేదన**

**సరఫరా చేయాలని విజ్ఞప్తి**



దేశంలో ఇంధన కొరత లేదని ఒకవైపు కేంద్ర ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, పెట్రోల్ బంకులు, గ్యాస్ స్టేషన్ల వద్ద రద్దీ మాత్రం తగ్గడం లేదు. హైదరాబాద్ లక్డీకాపూల్, ఖైరతాబాద్ ప్రాంతంలో సీఎన్‌జీ గ్యాస్ కోసం ఓ బంకు వద్ద ఆటోలు బారులుతీరాయి. సుమారు 3 కిలోమీటర్ల మేర క్యూలైన్‌లో వాహనదారులు వేచి ఉన్నారు. అర్ధరాత్రి సమయంలో పెట్టిన ఆటోలు వేకువ జాము అయ్యే వరకు బంక్ దగ్గరకు చేరుకుని సీఎన్‌జీ ఫిల్ చేసుకుని సర్వీసులకు సిద్ధం అవుతున్నట్లు చెబుతున్నారు. ఇంధన కొరతపై వస్తున్న వదంతులతో తీవ్రమైన రద్దీ నెలకొందని చెబుతున్నారు.

**గ్యాస్ దిగుమతులపై తీవ్ర ప్రభావం :** హైదరాబాద్ మహానగరంలో గురువారం సీఎన్‌జీ, ఎల్‌పీజీ కొరతతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వివిధ ప్రాంతాల్లో కిలోమీటర్ల మేర వాహనాలు క్యూలు కట్టాయి. ఆటో, క్యాబ్ డ్రైవర్లు, ప్రైవేట్ వాహనదారులు ఇంధనం నింపుకోవడానికి నానాయాతన అనుభవించారు. పశ్చిమాసియాలో నెలకొన్న క్లిష్ట పరిస్థితుల నేపథ్యంలో గ్యాస్ దిగుమతులపై తీవ్ర ప్రభావం పడింది. దీని ఫలితంగా సీఎన్‌జీ సప్లై తగ్గింది.

**తీవ్ర అవస్థలు పడుతున్నాం :** దాదాపు ఆరు నుంచి ఎనిమిది గంటల పాటు వేచి ఉండాల్సి వస్తోందని పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేశారు. లక్డీకాపూల్, కూకట్‌పల్లి, మెహిదీపట్నం, ఉప్పల్, మియాపూర్ సహా పలు ప్రాంతాల్లో కిలోమీటర్ల మేర వాహనాల క్యూ కనిపించింది. గ్యాస్ కోసం వేచి ఉండాల్సి రావడంతో ట్రిప్పులను కోల్పోతూ తీవ్ర అవస్థలు పడుతున్నామని చెబుతున్నారు. దీని ద్వారా తమకు ఆర్థిక శక్తి కూడా తగ్గిపోతుందన్నారు.

**ఎక్కడెక్కడ ఎలా?**

లక్డీకాపూల్‌లో ప్రధాన రహదారిపై ఆటో డ్రైవర్లు బైఠాయించి నిరసన తెలపడంతో కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఆసిఫ్‌నగర్, మల్లేపల్లి రహదారిలో దాదాపు 4 కిలోమీటర్ల మేర గ్యాస్ కోసం వాహనాలు వరుసగా బారులు తీరాయి. లక్డీకాపూల్, మూసాపేటలో కిలోమీటరుకు పైగా వాహనాలు ఎక్కడికక్కడ నిలిచాయి. వాహనాల రద్దీతో స్టేషన్లలో గ్యాస్ అయిపోవడంతో నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. కొన్నిచోట్ల గ్యాస్ కొరతను సాకుగా చూపి, అసలు ధర కంటే కిలోకు రూ.20 నుంచి రూ.30 వరకు ఎక్కువగా వసూలు చేస్తున్నారని ఆటో డ్రైవర్లు ఆరోపిస్తున్నారు.

**డిమాండ్ పెరగడంతోనే కొరత :** గ్యాస్ దొరకదనే భయంతో అందరూ ఒకేసారి ఫిల్లింగ్ స్టేషన్లకు రావడంతో కృత్రిమంగా కొంతవరకు కొరత ఏర్పడుతోందని గ్యాస్ డీలర్లు చెబుతున్నారు. గ్యాస్ సరఫరాలో సమస్యలు ఉన్నా, పరిస్థితి అధ్వానంగా లేదని అంటున్నారు. మళ్లీ గ్యాస్ దొరుకుతుందో లేదో? అని ఆందోళనతో గ్యాస్ స్టేషన్లకు వస్తుండటంతో సాధారణం కంటే డిమాండ్ పెరిగి ఈ తరహా ఇబ్బందులు ఏర్పడుతున్నాయని చెప్పారు. పెట్రోల్ దొరకదనే ప్రచారంతో నగరంలోని బంకుల్లో వాహనదారులు పగలు, రాత్రి అనే తేడా లేకుండా గంటల తరబడి వేచి చూస్తున్నారు. "ప్రస్తుతం ఆటోకు గ్యాస్ నింపుకోవడానికి దాదాపు ఒక రోజు సమయం పడుతోంది. మరుసటి రోజు మాత్రమే ఆటోను కిరాయికి తిప్పాల్సిన దుస్థితి ఏర్పడింది. ఒక స్టేషన్ నుంచి మరో స్టేషన్‌కు గ్యాస్ కోసం ఉరుకులు, పరుగులు పెడుతున్నాం. దాదాపు పది రోజులుగా పరిస్థితి అధ్వానంగా తయారైంది. గ్యాస్ కొరతతో పలు ప్రాంతాల్లో హోటళ్లు, కర్రీ పాయింట్లు మూతపడ్డాయి. అందులో పని చేసే కార్మికులను సైతం తీసేస్తున్నారు. దీంతో వారికి ఏం చేయాలో తెలియని ఆందోళనకర పరిస్థితి తలెత్తింది. కమర్షియల్ సిలిండర్ వాస్తవ ధరకు రెండు మూడురెట్లు ఎక్కువగా ఇస్తామని చెప్పినా, లభించడం లేదని నిర్వాహకులు చెబుతున్నారు.

# రాజధానిలో పైపుల దహనం కేసు కొలిక్కి

**కాపలాదారే నిప్పు పెట్టినట్లు నిర్ధరణ**

**రాయపూడి సమీపంలో పైపులు దగ్ధమైన ఘటనకు కాపలాదారుడే కారణం**

**సెక్యూరిటీ గార్డు రాము నిప్పు పెట్టినట్లు ప్రాథమికంగా తేల్చిన పోలీసులు**

**నిప్పుపెట్టేందుకు కారణాలేంటి? ఎవరైనా ప్రోత్సహించారా అన్న కోణంలో ఆరా**



రాజధాని అమరావతిలోని రాయపూడి సమీపంలో పైపులు దగ్ధమైన ఘటనకు కాపలాదారుడే కారణం అని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. ఘటనా స్థలంలో పని చేస్తున్న సెక్యూరిటీ గార్డు రాము నిప్పు పెట్టినట్లు తేల్చారు. అయితే ఇందుకు కారణాలేంటి? ప్రోత్సహించిన వారెవరైనా ఉన్నారా? అన్న కోణంలో ఆరా తీస్తున్నారు. రాజధాని ప్రాంతంలో వరుసగా 3 అగ్నిప్రమాద ఘటనలు చోటు చేసుకున్నాయి. కోట్ల రూపాయల విలువైన పైపులు ధ్వంసం కావడం వల్ల ఈ వ్యవహారాన్ని ప్రభుత్వం సీరియస్ తీసుకుంది. వరుస అగ్ని ప్రమాదాల వెనుక గల కారణాలు అన్వేషించి బాధ్యుల్ని గుర్తించడానికి పోలీసు యంత్రాంగం ప్రత్యేక దర్యాప్తు చేసింది.

**ఎవరెవరితో సంభాషించారనే విషయాల పై ఆరా :** గుంటూరు అదనపు ఎస్పీ రవికుమార్ ఆధ్వర్యంలో 4 బృందాలు పలు కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. ఘటనాస్థలిలో సాక్షులను పోలీసులు విచారించారు. పక్కనే క్యాంపుల్లో ఉంటున్న కార్మికుల వివరాలు సేకరించారు. ఫోన్ కాల్స్ డేటా, అనుమానాస్పద వ్యక్తుల విచారణ ఘటనాస్థలిలో ప్రత్యేక పరిస్థితులు ఏమైనా ఉన్నాయా? వంటి వాటి పై దృష్టి సారించారు. క్లూస్ టీం, ఫోరెన్సిక్ బృందం ఇచ్చిన సమాచారాన్ని ఒక బృందం విశ్లేషించింది. పైపులు దగ్ధమైన సమయంలో సెల్ టవర్ సిగ్నల్స్ ఆధారంగా ఆ సమయంలో ఏ ఫోన్ కాల్స్ వెళ్లాయి? ఎంతమంది మాట్లాడుకున్నారు? ఎవరెవరితో సంభాషించారనే విషయాలపై ఆరా తీసి విశ్లేషించారు. అదే సమయంలో ఎవరెవరు ఆ ప్రాంతంలో సంచరించారనే కోణంలో గాలించారు. కొంత సమాచారం సేకరించిన తర్వాతా సెక్యూరిటీ గార్డు రామును ఘటనాస్థలికి తీసుకెళ్లారు. ఆరోజు ఏం జరిగిందన్న అన్న విషయాన్ని అతడ్ని క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. మంటలు ఏ సమయంలో ఎప్పుడు గుర్తించారు? ఏప్రాంతంలో గుర్తించారు? తొలుత ఎవరికీ సమాచారం ఇచ్చారు? మంటలు అదుపుచేయడానికి చేసిన ప్రయత్నాలేమిటి? ఎంత సమయంలో మంటలు విస్తరించాయి? వంటి అంశాలపై ప్రశ్నించారు.

**కాపలాదారే పైపులకు నిప్పు పెట్టినట్లు నిర్ధరణ:** పైపులకు కాపలాగా ఉన్న సెక్యూరిటీ గార్డు రాము నుంచి వివరాలు సేకరించారు. ఈ క్రమంలో పొంతన లేని సమాధానాలు చెప్పడంతో పోలీసులకు అతనిపై అనుమానం కలిగింది. అతడిని 2 రోజుల పాటు అదుపులోకి తీసుకుని ప్రశ్నించి పలు వివరాలు రాబట్టారు. ఘటనాస్థలిలో ఆధారాలు, సాంకేతిక డేటా విశ్లేషణ, పలు మార్గాల్లో సేకరించిన సమాచారం మేరకు కాపలాదారే నిప్పు పెట్టినట్లు పోలీసులు నిర్ధరణకు వచ్చారు. సిట్ అధికారి రవికుమార్, తుళ్లూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, సిట్ బృందంతో భేటీ అయ్యి జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అగ్ని ప్రమాద ఘటన దర్యాప్తు పై చర్చించారు. గురువారం ఘటనాస్థలికి సెక్యూరిటీ గార్డు రామును తీసుకెళ్లారు. ఈనెల 23 రాత్రి ఏం జరిగింది అన్న విషయాన్ని మరోసారి సీన్ రీకనస్ట్రక్షన్ చేసి కొన్ని విషయాలు నిర్ధారించుకున్నారు. రాజధాని అగ్నిప్రమాద ఘటన సాంకేతిక ఆధారాల విశ్లేషణ ద్వారా కేసును కొలిక్కి తెచ్చినట్లు సమాచారం. అయితే కాపలాదారుడే నిప్పు పెట్టడానికి కారణాలు ఏంటి? అందుకు ఎవరైనా ప్రోత్సహించారా? దీని వెనుక ఏదైనా కుట్ర దాగి ఉందా? అన్న కోణంలో ఆరా తీస్తున్నారు.



# అనంతపురం జిల్లాలో బాలుడి హత్య

**నిందితుడిపై పోలీసుల కాల్పులు**

**తనకు గౌరవం ఇవ్వడంలేదని అత్త, మామలపై కక్ష పెంచుకున్న సర్వేశ్**

**బావమరిదిని రాళ్లతో కొట్టి చంపి కుందనకోట కొండలో పడేసిన సర్వేశ్**

**సీన్ రీకన్‌స్ట్రక్షన్ కోసం తీసుకెళ్తుండా పోలీసులపై తిరగబడిన సర్వేశ్‌కుమార్**



అనంతపురం జిల్లాలో బావమరిది అయిన ఐదేళ్ల బాలుడిని హత్యచేసిన ఘటనలో నిందితుడిపై పోలీసుల కాల్పులు జరిపారు. యాడికి మండలం కోన ఉప్పలపాడులో ఏడేళ్ల బావమరిది హేమచంద్రను అతని బావ సర్వేశ్‌కుమార్ హత్య చేశాడు. సీన్ రీకన్‌స్ట్రక్షన్ కోసం ఘటనాస్థలి వద్దకు తీసుకెళ్తుండగా పోలీసులపై నిందితుడు సర్వేశ్‌కుమార్ తిరగబడ్డాడు. కొండల్లో తీసుకెళ్తుండగా ఖాళీ బీరు బాటిల్‌తో పోలీసులపై దాడి చేశాడు. పోలీసులు హెచ్చరించినా వినకపోవటంతో పోలీసులు గాల్లోకి నాలుగు రౌండ్లు కాల్పులు జరిపారు. నిందితుడు వెనక్కి తగ్గకపోవడంతో మోకాళ్లపై సీఐ కాల్పులు జరిపారు. సర్వేశ్‌కుమార్ దాడిలో సీఐ రామసుబ్బయ్య, మరో కానిస్టేబుల్ గాయపడ్డారు. గాయపడిన వారిని తాడిపత్రి ఆస్పత్రికి తరలించారు

**అసలేం జరిగిందంటే :** తాడిపత్రి నియోజకవర్గంలోని కోన ఉప్పలపాడు గ్రామానికి చెందిన గోవిందు, కాంతమ్మ దంపతుల కుమారుడు హేమచంద్ర. హేమచంద్రతో పాటు వీరికి లలిత, సులోచన హేమ అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరిలో లలితకు నిట్టూరు గ్రామానికి చెందిన బోయ సర్వేశ్ ప్రేమించుకోవడంతో వివాహం జరిపించారు. సర్వేశ్, లలిత దంపతుల మధ్య తరచుగా గొడవలు జరుగుతున్నాయి. ఉగాది పండుగ సందర్భంగా సర్వేశ్ తన అత్తమామల ఇంటికి వెళ్లాడు. కానీ అక్కడ అతను ఆశించిన విధంగా అత్తమామలు మర్యాద చేయలేదని కక్షపెంచుకున్నాడు. బుధవారం బావమరిది హేమచంద్ర పాఠశాల నుంచి బస్సులో గ్రామానికి రాగానే సర్వేశ్ ద్విచక్ర వాహనంపై ముఖానికి మాస్క్ ధరించి వచ్చి తీసుకెళ్లాడు. ఆపై ఆ బాలుడిని హత్య చేసి కుందనకోట కొండలో పడేశాడు. పాఠశాలకు వెళ్లిన బాలుడు ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించడంతో విచారణ చేపట్టారు.

**పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం :** ఊర్లోని సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు సర్వేశ్‌ని అదుపులోకి తీసుకున్నారు. ఆ చిన్నారికి మాయ మాటలు చెప్పి, కిడ్నాప్ చేసి కుందనకోట గ్రామ శివారులలోకి తీసుకొని వెళ్లి రాళ్లతో కొట్టి హతమార్చినట్లుగా గుర్తించారు. పోలీసుల సమాచారం మేరకు తల్లిదండ్రులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. బాలుడి మృతదేహాన్ని చూసి గుండెలవిసేలా రోదించారు.

# విశాఖ తీరానికి ఎల్‌పీజీ, చమురు నౌకలు

**గ్యాస్, ఇంధన నిల్వలపై ఆందోళనకి చెక్**

**గ్యాస్, ఇంధన నిల్వలపై ఆందోళన వేళ సాగర నగరానికి చేరుతున్న నౌకలు**

**విశాఖకు 24 వేల మెట్రిక్ టన్నుల ఎల్‌పీజీ గ్యాస్‌తో 'బీడబ్ల్యూ బ్రిచ్'నౌక**

**నేడు గ్యాస్ అన్‌లోడ్**



పశ్చిమాసియా యుద్ధ ప్రభావంతో గ్యాస్, ఇంధన నిల్వలపై ప్రజలలో ఆందోళనలు నెలకొన్న సమయంలో ఈ విషయం అందరికీ శుభవార్తనే చెప్పుకోవాలి. గ్యాస్, ఆయిల్ కొరత వస్తుందనే భయంతో గ్యాస్ స్టేషన్ వద్ద, పెట్రోల్ బంకుల వద్ద ప్రజలు బారులు తీరారు. ఇప్పుడు అలాంటి అవసరం ఇక ఉండదు. విశాఖ తీరానికి ఎల్‌పీజీ, చమురు నౌకలు ఒక్కొక్కటిగా చేరుకుంటున్నాయి. ఇవి తీరానికి చేరడంతో ఇకపై సరఫరా సమస్యలు తీరనున్నాయి.

**ఇంధన, గ్యాస్ సమస్యలు ఇక ఉండవు :** ఇరాన్ అమెరికా యుద్ధం కారణంగా గ్యాస్, ఇంధన నిల్వలపై ప్రజల్లో కొద్ది రోజులుగా భారీ ఆందోళన వ్యక్తమవుతోంది. ముందు ముందు యుద్ధం తీవ్రత పెరిగే అవకాశాలు ఉన్నందున సరఫరాకు ఆటంకం కలుగుతుందేమోనని అవసరానికి మించి గ్యాస్, ఇంధనాలను నిల్వ ఉంచుకుంటున్నారు. కానీ ఇప్పుడు ఆ అవకాశం లేదు. విశాఖ సాగర నగరానికి నౌకలు చేరుతున్నాయి. దీంతో ఇప్పుడు ప్రజలు అంతగా చింతించనవసరం లేదు .

**విశాఖకు బీడబ్ల్యూ బ్రిచ్ నౌక ఎంట్రీ :** భారత దేశానికి సంబంధించిన నౌకలు వెళ్లేందుకు ఇరాన్ అనుమతి ఇచ్చింది. దాంతో సముద్ర తీరంలో యాంకర్ అయి ఉన్న నౌకలు విశాఖ పోర్ట్ తీరానికి వస్తున్నాయి. అయితే విశాఖకు 24 వేల మెట్రిక్ టన్నుల ఎల్‌పీజీ గ్యాస్‌తో 'బీడబ్ల్యూ బ్రిచ్'అనే భారీ నౌక గురువారం తీరానికి చేరింది. దీంతో శుక్రవారం ఈ నౌక నుంచి అధికారులు గ్యాస్‌ను అన్‌లోడ్ చేయనున్నారు. దీంతో గ్యాస్ కొరత వస్తుందేమో అని అనుకున్న ప్రజలకు వీటి రాక ఊరట కలిగించిందనే చెప్పవచ్చు.

**పోర్టుకు వస్తున్న మరి కొన్ని నౌకలు :** కేవలం ఈ ఒక్క నౌక మాత్రమే కాదు. నెదర్లాండ్స్‌లో లోడింగ్ చేసుకున్న హెల్లాస్ గ్లాడియేటర్, అమెరికా పోర్టులో లోడింగ్ చేసుకున్న జుపిటర్ నౌకలు ఈ నెల 30న విశాఖకు రానున్నాయి. ఇప్పటికే లుపినస్ , ఏఐ వుకిర్ నౌకలు యూఏఈ, ఖతార్ నుంచి గత నెల 26, ఈ నెల 3న విశాఖ చేరుకున్నాయి. హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్‌కు సంబంధించి ఎంపీ సమర్ శృతి నౌక పోర్టులో యాంకరేజీలో లంగర్ వేసి ఉంచారు. 65 వేల టన్నుల హైస్పీడ్ డీజిల్‌ను అన్‌లోడ్ చేస్తున్నారు.

**పది చమురు, రెండు ఎల్‌పీజీ నౌకలు :** ఎంవీ స్వర్ణ సింధు అనే క్రూడ్ ఆయిల్ నౌక హెచ్‌పీసీఎల్ కోసం మరో రెండు రోజుల్లో చేరుకోనుంది. శుక్రవారం రష్యా నుంచి జంబో నౌక లక్షా 36 వేల 728 టన్నుల క్రూడ్ ఆయిల్‌తో విశాఖకు చేరుకోనుంది. వచ్చే నెల 2, 5 తేదీల్లో రష్యా నుంచి ఫొండేయ , దేశ్ గౌరవ్ నౌకలు ముడి చమురుతో రానున్నాయి. ఈ నెల 1 నుంచి 25 వరకు ఇరాక్, రష్యా, ఖతార్, యూఏఈ, భారత దేశంలోని పలు పోర్టుల నుంచి పది చమురు నౌకలు, రెండు ఎల్‌పీజీ నౌకలు విశాఖకు చేరినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

**ప్రజల్లో బలపడుతున్న ఊహాగానాలు :** నౌకలు పోర్టుకు వస్తున్న సమాచారం తెలుసుకున్న ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు . ఇక ఇప్పట్లో ఇంధన, గ్యాస్‌ల కొరత రాదనే నమ్మకం వారిలో బలపడుతుంది. అయితే ఒక వేళ యుద్ధ పరిస్థితులు బల పడిన ఇలానే కొద్ది రోజులు యుద్ధాన్ని ఆపి నౌకలను పంపించే ప్రయత్నాలు జరగవచ్చనే ఊహాగానాలు ప్రజల్లో మొదలవుతున్నాయి.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com